క్లుప్తంగా

మత్స్య అవతారంలో జగన్నాథుడు



మత్స్య అవతారంలో జగన్నాథస్వామి

పాలకొండ: రథయాత్ర ఉత్సవాల్లో భాగంగా జగన్నాథస్వామి మత్స్య అవతారంలో భక్తులకు గురువారం దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా ఆలయం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ఈవో వి.రాధాకృష్ణ భక్తులకు ఎటువంటి ఇబ్బందుల్లేకుండా ఏర్పాట్లు పర్యవేక్షించారు. ఆలయ ప్రధాన అర్చకుడు విశ్వనాథందాస్ స్వామికి చోడాపచార పూజలు జరిపించారు.

బాలేరులో డ్రోన్ సర్వే



డ్రోన్ సర్వే ప్రారంభిస్తున్న ఎంపీటీసీ, సర్పంచ్

భామిని: మండలంలోని సొలికిరి రెవెన్యూ గ్రూప్ పరిధిలో వైఎస్సార్ జగనన్న శాశ్వత భూ హక్కు, శాశ్వత భూసర్వేలో భాగంగా డ్రోన్ సర్వే గురువారం నిర్వహించారు. బాలేరు ఎంపీటీసీ కొత్తకోట చంద్రశేఖర్, సర్పంచ్ జామి ప్రభాకర్ సర్వేను ప్రారంభించారు. సర్వేకు రైతులు సహకరించాలని వారు కోరారు. రెవెన్యూ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

నేడు 'గడప గడపకు మన ప్రభుత్వం'

వీరఘట్టం: మండలంలోని చిట్టపులివలస గ్రామంలో శుక్రవారం మధ్యాహ్నం 3 గంటలకు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఎంపీడీవో జయంత్‌ప్రసాద్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ పాల్గొంటారని తెలిపారు. మండల స్థాయి అధికారులు చిట్టపులివలస గ్రామానికి సంబంధించిన పూర్తి సమాచారంతో హాజరు కావాలని కోరారు. సచివాలయ సిబ్బంది ,గ్రామ వలంటీర్లు సిద్ధంగా ఉండాలని కోరారు.

తహసీల్దార్‌గా జనార్దన్



గరుగుబిల్లి: మండల తహసీల్దార్‌గా జీవీ జనార్దన్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన విశాఖపట్నం అర్బన్ మండలంలో డిప్యూటీ తహసీల్దార్‌గా పని చేస్తూ ఉద్యోగోన్నతిపై ఇక్కడకు వచ్చారు. ఇంత వరకు ఇక్కడ పని చేసిన అజూరఫీజాన్ విజయనగరం జిల్లా బాడంగి మండల తహసీల్దార్‌గా బదిలీపై వెళ్లారు. ఈ సందర్భంగా బాధ్యతలు స్వీకరించిన జనార్దన్ మాట్లాడుతూ మండల పరిధిలోని సమస్యలను సిబ్బంది సమన్వయంతో పని చేసి పరిష్కరించేలా కృషి చేస్తానన్నారు. రెవెన్యూ సమస్యలు, రీసర్వేపై ప్రత్యేక దృష్టి సారించినున్నట్టు తెలిపారు.

జీసీసీ పురోభివృద్ధే లక్ష్యం : డీఎం



ఇండేన్ గ్యాస్ గొడౌన్‌ను తనిఖీ చేస్తున్న జీసీసీ డీఎం

గుమ్మలక్ష్మీపురం: గిరిజన సహకార సంస్థ (జీసీసీ) పురోభివృద్ధికి కృషి చేయాలని పార్వతీపురం డివిజనల్ మేనేజర్ వి.మహేంద్ర కుమార్ అన్నారు. గుమ్మలక్ష్మీపురం జీసీఎంఎస్ పరిధిలోని ఇండేన్ గ్యాస్ గొడౌన్, ఎంఎల్ఎస్ స్టాక్‌పాయింట్, పెట్రోల్ బంకును గురువారం పరిశీలించారు. రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించి, నిల్వలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ ఈ ఏడాది డివిజన్ పరిధిలో రూ.53.33 కోట్లు విలవ చేసే వ్యాపారలావాదేవీలు నిర్వహించాలన్నది లక్ష్యం కాగా, ఇప్పటివరకు రూ.7.83 కోట్ల విలువైన వ్యాపారం చేశామన్నారు. జూన్ నెల పూర్తయ్యేలోగా మరో రూ.4 కోట్ల మేర వ్యాపారలావాదేవీలు జరుగుతాయని తెలిపారు. అటవీ వ్యవసాయ ఉత్పత్తుల కొనుగోలుకు ప్రాధాన్యమిస్తున్నామన్నారు. గ్యాస్, పెట్రోల్, డీజిల్ అమ్మకాలు పెంచుతామని తెలిపారు. కొత్తగా గ్యాస్ గొడౌన్‌లు, పెట్రోల్ బంకుల నిర్మాణం కోసం ప్రతిపాదనలు పంపడంతో పాటు జీసీసీ ద్వారా వ్యవసాయ రుణాలు మంజూరు చేపట్టనున్నట్టు వెల్లడించారు. జూలై నుంచి డివిజన్ పరిధిలోని 3 ఎంఎల్ఎస్ స్టాక్ పాయింట్లు (కురుపాం, గుమ్మలక్ష్మీపురం, సాలూరు)నుంచి నిత్యావసర సరుకులు తమ వాహనంతోనే సరఫరా చేస్తామన్నారు. అనంతరం సేల్స్‌మేన్లు, డీలర్లతో మాట్లాడారు. ఆయన వెంట జీసీసీ సిబ్బంది సాంబశివరావు, అకౌంటెంట్ గణపతిరావు, సంగమేష్ ఉన్నారు.

సాగుకు సిద్ధం



● నారుమడులు సిద్ధం చేస్తున్న రైతులు

రైతులు కోటి ఆశలతో తొలకరి సాగుకు సన్నద్ధమవుతున్నారు. వాతావరణం అనుకూలించడంతో నారుమడుల పనులు ముమ్మరం చేస్తున్నారు. ఇటీవలె రైతుభరోసా నిధులు కూడా జగన్‌మోహన్‌రెడ్డి సర్కారు రైతుల ఖాతాల్లో వేయడంతో పెట్టుబడికి ఇబ్బందులు లేకుండా ముందుకు సాగుతున్నారు.

గరుగుబిల్లి: మండలంలో 12వేల 300 ఎకరాలలో ఈ ఏడాది ఖరీఫ్‌లో వరి పంటను సాగు చేసేందుకు రైతులు సిద్ధమవుతున్నారు. ఇప్పటివరకు 30 శాతం మేర వరి నారుమడులను సిద్ధం చేశారు. ముందుగా నారుమడులు పోసిన చోట చెరువులు, వర్షాధార పొలాలలో జూలై నెల ప్రారంభంలో నాట్లు వేయడం ప్రారంభమవుతాయి. తోటపల్లి ప్రాజెక్టు పరిధిలోని కుడి, ఎడమ కాలువల పరిధిలో జూలై మూడవ వారంలో వరి ఉభాలు ప్రారంభమవుతాయి. ప్రస్తుత సీజన్‌కు సంబంధించి సాగుకు అవసరమైన విత్తనాలను ఆర్‌బీకేల ద్వారా వ్యవసాయాధికారులు, వలంటీర్ల పర్యవేక్షణలో సరఫరా చేస్తున్నారు. ఎరువులను కూడా అందించేందుకు ప్రణాళికలను తయారు చేస్తున్నారు.

నారుమడి తయారీ ఇలా..

నారుమడి తయారు చేసుకోవడానికి వినియోగించే భూమిలో చివరి దుక్కిలో ఐదు సెంట్ల భూమికి రెండు కిలోల యూరియా, ఆరు కిలోల సింగిల్ సూపర్ ఫాస్పేట్, కిలో ఎంటీపీ (మ్యూరెట్ ఆఫ్ పొటాష్)ను కలిపి దుక్కు చేయాలి. ఆకుమడిలో ముంపు నీరు దిగేందుకు చిన్నచిన్న బోదెలును ఆకుమడి చుట్టూ ఏర్పాటు చేసుకోవాలి.

విత్తనశుద్ధితో నాణ్యమైన నారు

విత్తనశుద్ధితో నాణ్యమైన నారు లభిస్తుంది. తడి, పొడి విత్తన శుద్ధిని పాటించాలి. పొడి శుద్ధి విధానంలో కిలో విత్తనాలకు మూడు గ్రాముల చొప్పున కార్బండింజమ్ మందు విత్తనాల సంచిలో వేసి మూతి బిగించి బాగా కలిపి 24 గంటలు నిల్వ వుంచాలి. ఆ తర్వాత వాటిని నానబెట్టి నారుమడిలో చల్లుకోవాలి. తడి విత్తన శుద్ధి విధానంలో కిలో విత్తనానికి ఒక గ్రాము కార్బండిజమ్ మందును ఒక లీటరు నీటిలో కలిపి 24 గంటలు నానబెట్టి మరో 24గంటలు మడికట్టి వాటిని నారుమడిలో చల్లుకోవాలి. ఎకరా నారుమడికి 30 కేజీల వరి విత్తనాలు అవసరమవుతాయి. నారుమడిలో విత్తనాలను చల్లుకొన్న తరువాత మొదటి ఆకు విచ్చుకొనే వరకు పది రోజుల పాటు ఆరుతడి యాజమాన్యం (నారుమడిలో నీరుపెట్టడం, తొలగించడం) చేయాలి. తరువాత మొదటి ఆకు విచ్చుకొన్నాక నారుమడిలో నీరు వుంచాలి. ఇలా నారుమడి వేసిన 21 నుండి 25 రోజుల్లో నాణ్యమైన నారు తయారవుతుంది.

అధికారుల సూచనలు పాటించాలి

విత్తనాలను లైసెన్సు పొందిన డీలర్ల నుండే కొనుగోలు చేయాలి. విత్తనం కొన్న వెంటనే 100 గింజలను మొలకను పరీక్ష చేయాలి. 80 శాతం మొలకవచ్చిన విత్తనాలనే వాడాలి. మొలక శాతం తగ్గినా, కేళీలు వచ్చినా విత్తనాలను మరలా తీసుకోవచ్చు. నారుమడి పోసేటప్పుడు విత్తనాల సంచిని, ట్యాగ్‌ను, రశీదును జాగ్రత్తగా ఉంచాలి. ఎకరానికి ఐదుసెంట్ల నారుమడి ఉండేటట్లుగా నారు పోసుకోవాలి. తద్వారా ఆశించిన దిగుబడులను పొందవచ్చు.

ఘనంగా ఎమ్మెల్యే పుష్పశ్రీవాణి జన్మదిన వేడుకలు

జియ్యమ్మవలస:

రాష్ట్ర మాజీ ఉప ముఖ్యమంత్రి, ఎమ్మెల్యే పాముల పుష్పశ్రీవాణి పుట్టిన రోజు వేడుకలు చినమేరంగిలో గురువారం ఘనంగా జరిగాయి. పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానుల నడుమ పుష్పశ్రీవాణి కేక్ కట్ చేశారు. వైఎస్సార్‌సీపీ పార్వతీపురం మన్యం జిల్లా అధ్యక్షుడు శత్రుచర్ల పరీక్షిత్‌రాజుకు కేక్‌ను తినిపించారు. అనంతరం అందరికీ మిఠాయిలు పంచిపెట్టారు. గరుగుబిల్లి, కొమరాడ, జియ్యమ్మవలస, గుమ్మలక్ష్మీపురం, కురుపాం మండల పార్టీ కన్వీనర్లు ఉరిటి రామారావు, ద్వారపురెడ్డి జనార్దన్, మూడడ్ల గౌరీశంకరరావు, కె.దీనమయ్య, ఐ.గౌరీశంకరరావుతో పాటు ఉమ్మడి జిల్లా జెడ్పీ వైస్ చైర్మన్ మరిశర్ల బాపూజీనాయుడు తదితరులు ఎమ్మెల్యే పుష్పశ్రీవాణికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, జెడ్పీటీసీలు, కార్యకర్తలు, అభిమానులు, పలువురు అధికారులు పాల్గొన్నారు.

రోగులకు పండ్లు, రొట్టెల పంపిణీ

గుమ్మలక్ష్మీపురం: ఎమ్మెల్యే పాముల పుష్పశ్రీవాణి జన్మదినాన్ని పురస్కరించుకొని గురువారం గుమ్మలక్ష్మీపురం గ్రామానికి చెందిన వ్యాపారస్తుడు మద్ది దొరబాబు సమకూర్చిన రొట్టెలు, పండ్లను భద్రగిరి సామాజిక ఆరోగ్య కేంద్రంలో చికిత్స పొందుతున్న 50 మంది రోగులకు ఎంపీపీ కుంబురుక దీనమయ్య, సర్పంచ్ బొత్తాడ గౌరీశంకరరావు, వైస్ ఎంపీపీ నిమ్మక శేఖర్, ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సభ్యుడు వహీద్‌ఖాన్ పంపిణీ చేశారు. అంతకు ముందు ఆస్పత్రి ఆవరణలో కేక్‌ను కట్ చేశారు. కార్యక్రమంలో వైద్యులు రవికుమార్ పాల్గొన్నారు.



జియ్యమ్మవలస: మన్యం జిల్లా అధ్యక్షుడు పరీక్షిత్‌రాజుకు కేక్ తినిపిస్తున్న ఎమ్మెల్యే పుష్పశ్రీవాణి



కురుపాం: రోగులకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేస్తున్న ఎంపీపీ దీనమయ్య



జియ్యమ్మవలస: కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే పుష్పశ్రీవాణి

వేడుకగా తొలిదశమి పూజలు

గరుగుబిల్లి:

మండలంలోని రావుపల్లి గ్రామంలో జగన్నాథస్వామి రథయాత్ర కార్యక్రమంలో భాగంగా తొలిదశమి పూజలను అర్చకులు బి.సూర్యనారాయణ శర్మ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తొలి దశమి నుంచి ఆవిటి వరకు ప్రతీ రోజు సాయంత్రం శ్రీ ఉమా రామలింగేశ్వర భజన బృందం ఆధ్వర్యంలో భజనలను నిర్వహించనున్నారు. జగన్నాథ స్వామి వేడుకలను పురస్కరించుకొని ఈ భజన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు సర్పంచ్ బొంతాడ మహేశ్వరరావు తెలిపారు. కార్యక్రమంలో భక్తులు పాల్గొన్నారు.



రావుపల్లిలో భజన చేస్తున్న సభ్యులు

ఉచిత వైద్య శిబిరం

గరుగుబిల్లి: మండలంలోని మరుపెంట పంచాయతీ సాంబన్నవలసలో శ్రీకాకుళం జిల్లా రాగోలు జెమ్స్ ఆస్పత్రి ఆధ్వర్యంలో వైద్య శిబిరాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ దిలీప్, డాక్టర్ సుజిత్‌లు రోగులకు తనిఖీలను నిర్వహించారు. అవసరమైన మందులను ఉచితంగా అందజేశారు. బీపీ, సుగర్ పరీక్షలను ఉచితంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఏరియా మేనేజర్ కె.రమేష్, పీఆర్‌ఓ ఎ.రాజు తదితరులు తమ సేవలు అందించారు.



సాంబన్నవలసలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరం

రైతులకు విత్తనాల పంపిణీ

సీతంపేట: మండలంలోని మానాపురం, టిటుకుపాయిలో ఎంపీపీ బిడ్డిక ఆదినారాయణ గురువారం విత్తనాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు విత్తనాలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఆర్‌బీకేల్లో మనకు కావాల్సిన విత్తనాలు లభిస్తున్నాయన్నారు. ఎరువులు, పురుగు మందులు సైతం అందుబాటులో ఉంటాయన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ నిమ్మక అరుణ తదితరులు పాల్గొన్నారు.



విత్తనాలు పంపిణీ చేస్తున్న ఎంపీపీ ఆదినారాయణ

బడి ఈడు పిల్లలు పాఠశాలల్లోనే ఉండాలి : పీవో



డ్రాపౌట్లకు అవగాహన కల్పిస్తున్న పీవో కల్పనాకుమారి

సీతంపేట: బడి ఈడు పిల్లలు బడిలోనే ఉండాలని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి కల్పనాకుమారి అన్నారు. వివిధ గ్రామాల్లో ఉన్న పిల్లల దగ్గరకు పీవో గురువారం స్వయంగా వెళ్లి చైతన్యం చేశారు. మొత్తం 14 మంది డ్రాపౌట్ విద్యార్థులను పాఠశాలల్లో చేర్పించే విధంగా చర్యలు తీసుకున్నారు. కుడ్డపల్లి గ్రామంలో ఆరుగురు, కిల్లాడలో 4, పూనుపేటలో నలుగురు విద్యార్థులను గుర్తించి పాఠశాలలో ప్రవేశం కల్పించారు. తల్లిదండ్రులు, విద్యార్థులతో మాట్లాడుతూ పాఠశాలల్లో చేరడం వలన ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలు, ఉద్యోగవకాశాల గూర్చి వివరించారు. ఎట్టి పరిస్థితుల్లో చదువు మధ్యలో మానొద్దని సూచించారు. ఇంకా గ్రామాల్లో ఎవరైన డ్రాపౌట్లు ఉంటే వెంటనే చేర్పించాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ ఈవో ఎ.లిల్లీరాణి, ఏఎంవో కోటిబాబు, జీసీడీవో రాములమ్మ, సీఎంవో చిరంజీవులు పాల్గొన్నారు.

సింగన్నవలసలో ఫ్యామిలీ డాక్టర్

పాలకొండ: మండలంలోని సింగన్నవలస గ్రామంలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం గురువారం నిర్వహించారు. అన్నవరం పీహెచ్‌సీ వైద్యాధికారి కమలనాథ్ ఆధ్వర్యంలో రోగులకు పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. దీర్ఘకాలిక రోగుల ఇంటికి వెళ్లి వారికి కావాల్సిన మందులు అందించడంతో పాటు ఆరోగ్య సలహాలు అందించారు. ఆయనతో పాటు ఏఎన్ఎం, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

పిల్లలను 'అంగన్‌వాడీ'లకు పంపండి

పాలకొండ రూరల్: ఐదేళ్లు నిండిన పిల్లలను తప్పనిసరిగా బడికి, రెండున్నర సంవత్సరాల గల పిల్లను ప్రీ స్కూల్(అంగన్‌వాడీ) కేంద్రాలకు పంపించాలని ఇన్‌చార్జ్ సీడీపీఓ, సెక్టారు సూపర్‌వైజర్ టి.మేరి అన్నారు. పాఠశాలకు సంసిద్ధత కార్యక్రమాన్ని పట్టణంలో గురువారం చేపట్టారు. ఈ క్రమంలో అన్ని అంగన్‌వాడీ కేంద్రాల్లో అర్హత కలిగిన పిల్లల తల్లితండ్రులకు అవగాహన కల్పించారు. జన్ బాగిదారి కార్యక్రమంలో భాగంగా పౌష్టికాహార ఆవశ్యకతపై కేంద్రం నిర్వహిస్తున్న కార్యక్రమాన్ని చేపట్టి ర్యాలీ నిర్వహించారు. ముఖ్యంగా గర్భిణులు, బాలింతలు ప్రస్తుత సీజన్‌లో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ఆహారపు నియమాలను వివరించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సిబ్బంది జయభూషణమణి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



కోమటిపేటలో జన్ బాగిదారి కార్యక్రమం నిర్వహిస్తున్న అంగన్‌వాడీలు

వేగవంతంగా గృహ నిర్మాణాలు

సీతంపేట: గృహ నిర్మాణ పనులు వేగవంతం చేయాలని ఐటీడీఏ పీవో కల్పనాకుమారి అన్నారు. పాలకొండ నియోజకవర్గ పరిధిలోని నాలుగు మండలాలకు చెందిన హౌసింగ్ ఏఈలతో ఆమె చాంబర్‌లో గురువారం సమావేశం ఏర్పాటు చేశారు. ఆన్‌లైన్‌లో బిల్లులు అప్‌లోడ్ చేయాలన్నారు. ఇంజినీరింగ్ అసిస్టెంట్లు పర్యవేక్షించాలన్నారు. ఇంకా ప్రారంభించని గృహనిర్మాణాలు త్వరితగతిన ప్రారంభించాలన్నారు.

సక్రమంగా రిజిస్ట్రేషన్లు

పాలకొండ: సచివాలయాల్లో భూ రిజిస్ట్రేషన్‌లు సక్రమంగా చేయాలని జేసీ గోవిందరావు తెలిపారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయాన్ని గురువారం సందర్శించిన ఆయన మండలంలోని సచివాలయాల్లో జరుగుతున్న రిజిస్ట్రేషన్‌ల తీరు పరిశీలించారు. సాంకేతిక సమస్యలున్నట్లు గుర్తించిన ఆయన సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో పరిశీలన చేశారు. సాంకేతిక సమస్యలు పరిష్కరించేందుకు తహసీల్దార్ పి.సోమేశ్వరరావుకు సూచనలు అందించారు. సచివాలయాల్లో పక్కాగా రిజిస్ట్రేషన్‌ల ప్రక్రియ చేయాలని తెలిపారు.



సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో పరిశీలన చేస్తున్న జేసీ గోవిందరావు

పక్కాగా జగనన్న సురక్ష



సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దార్ అప్పారావు, ఎంపీడీవో చంద్రరావు

భామిని: త్వరలో చేపట్టనున్న జగనన్న సురక్ష కార్యక్రమం పక్కాగా జరగాలని ఎంపీడీవో జి.చంద్రరావు, తహసీల్దార్ నీలాపు అప్పారావు అన్నారు. వెలుగు కార్యాలయ సమావేశ మందిరంలో జగనన్న సురక్ష కార్యక్రమం అమలుపై వారి సమక్షంలో గురువారం సమీక్షించారు. ఈ నెల 23 నుంచి అమలు చేయాల్సిన కార్యక్రమాలను వివరించారు. సచివాలయ డిజిటల్ అసిస్టెంట్లు, వలంటీర్లు సంయుక్తంగా ఇంటింటా అవసరమైన ధ్రువ పత్రాలు అందజేయాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న కార్యక్రమం ప్రతీ ఇంటికి చేరేలా కార్యాచరణ ఉండాలన్నారు. డిప్యూటీ తహసీల్దార్ నిమ్మల శేఖరం, డీఏలు, వలంటీర్లు పాల్గొన్నారు.

ఎరువుల పంపిణీకి ఏర్పాట్లు

పాలకొండ రూరల్: ఖరీఫ్ సీజన్‌లో రైతులకు అవసరమైన ఎరువుల సమస్య తలెత్తకుండ ప్రణాళికాబద్ధంగా వ్యవహరిస్తున్నామని వ్యవసాయాధికారి ఎన్ని వాహిని అన్నారు. మండల పరిధిలో ఆర్‌బీకేల ద్వారా రైతులకు ఎరువులు అందించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్టు వివరించారు. గురువారం పలు ఆర్‌బీకేలకు యూరియా, డీఏపీ ఎరువులు రావటంతో వాటిని భద్రపర్చాలని గ్రామీణ వ్యవసాయ సహాయకులకు సూచించారు. డోలమడ, ఎల్.ఎల్.పురం, భాసూరు తదితర ఆర్‌బీకేలకు చేరిన ఎరువుల నిల్వలను పరిశీలించారు. రైతులు తొలకరి వర్షాలను అందిపుచ్చుకుని సేద్యానికి సిద్ధం కావాలన్నారు. ఈ నెలాఖరు నాటికి ఈకేవైసీ పూర్తి చేసుకోవాలన్నారు. సేద్యంలో సమస్యలు తలెత్తితే తమ సిబ్బంది సహకారం తీసుకోవాలని సూచించారు.



ఆర్‌బీకేలకు చేరిన యూరియా, డీఏపీ ఎరువులను పరిశీలిస్తున్న వ్యవసాయాధికారులు

రాయితీలను సద్వినియోగం చేసుకోవాలి

పాలకొండ రూరల్: వ్యవసాయ రంగంతో పాటు ఉద్యానవన రైతులను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం అందిస్తున్న రాయితీలను సంబంధిత రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఉద్యానవన శాఖాధికారిణి తమ్మినేని అమరేశ్వరి అన్నారు. మండలంలోని డోలమడలో పామాయిల్ రైతులకు 90 శాతం రాయితీపై అందించిన డ్రిప్ ఇరిగేషన్ యంత్రాల నిర్వహణ, రైతులు వినియోగిస్తున్న తీరును పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఐదెకరాల్లోపు భూమి ఉన్న రైతులు ఉద్యానవన పంటలు సాగు చేసేందుకు తోడ్పాటు అందిస్తామన్నారు. నిబంధనల మేరకు బిందు, తుంపర సేద్యం చేపట్టేందుకు అవసరమైన యంత్రాలను రాయితీపై సమకూరుస్తామని, ఔత్సాహిక రైతులు రైతు భరోసా కేంద్రాల ద్వారా దరఖాస్తులు అందించాలన్నారు. ఆమె వెంట ఆర్‌బీకే వ్యవసాయ సహాయకులు కె.అదిప్‌కుమార్ ఉన్నారు.



డ్రిప్ యంత్రాలను పరిశీలిస్తున్న అధికారులు

భూ సర్వేకు సహకరించాలి



భూ హక్కుదారుల సమక్షంలో రీసర్వే వివరాలు నమోదు చేస్తున్న రెవెన్యూ అధికారులు

పాలకొండ రూరల్: సమగ్ర భూసర్వే కార్యక్రమానికి రైతులు, భూ యజమానులు పూర్తి సమాచారంతో అందుబాటులో ఉంటూ సహకరించాలని తహసీల్దార్ పి.సోమేశ్వరరావు కోరారు. పట్టణ పరిధిలో జరుగుతున్న రీసర్వే కార్యక్రమాన్ని ఆయన గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా భూ హక్కుదారులు, రైతుల సందేహాలను నివృత్తి చేశారు. అధికారుల సూచనల మేరకు సమగ్ర సమాచారంతో వస్తే సర్వే ప్రక్రియ మరింత సులభతరమవుతుందని, తప్పిదాలకు ఆస్కారం ఉండదన్నారు. శుక్రవారం సర్వే నంబరు 438 నుంచి 443 మధ్యలో భూముల సర్వే చేపడతామన్నారు. సంబంధిత భూముల హక్కుదారులు హాజరు కావాలన్నారు. మండల సర్వేయరు పి.వెంకటరమణ, వీఆర్‌ఓలు బి.సాయిశ్రీనివాస్, రామారావు, సహాయ సర్వేయర్లు గణేష్, నాగరాజు, మణి ఉన్నారు.

టెన్త్ టాపర్‌కు అభినందనలు

సీతంపేట: పదో తరగతిలో అత్యధిక మార్కులు సాధించి స్టేట్ టాపర్‌గా నిలిచిన పెద్దమడి ఆశ్రమ పాఠశాలకు చెందిన గేదెల నిఖిత, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేతుల మీదుగా రూ.లక్ష చెక్కు, ప్రశంసా పత్రం అందుకున్న సందర్భంగా ఐటీడీఏ పీవో కల్పనాకుమారి గురువారం అభినందించారు. భవిష్యత్‌లో ఉన్నత చదువులు చదివి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో గిరిజన సంక్షేమ శాఖ డీడీ శ్రీనివాసరావు, డిప్యూటీ ఈవో లిల్లీరాణి, ఏఎంవో కోటిబాబు తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థి నిఖితను అభినందిస్తున్న పీవో కల్పనాకుమారి

నట్టల నివారణ మందులు వేయించుకోవాలి

గరుగుబిల్లి:

గొర్రెల పెంపకందారులు ప్రభుత్వం అందజేస్తున్న నట్టల నివారణ ముందులను మేకలకు, గొర్రెలకు వేయించుకొని సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ ఉరిటి రామారావు అన్నారు. మండలంలోని ఉల్లిభద్ర పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో మరుపెంట గ్రామంలో గురువారం ఏర్పాటు చేసిన నట్టల నివారణ కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెంపకందారులకు ప్రభుత్వం అనేక ప్రోత్సాహకాలు అందజేస్తుందన్నారు. ఈ మందులను వినియోగించడం వల్ల ఏలిక పాములు పూర్తిగా నివారించవచ్చునన్నారు. కార్యక్రమంలో డాక్టర్ సురేష్‌కుమార్‌తో పాటు సిబ్బంది పాల్గొన్నారు.



నట్టల నివారణ ముందులు వేస్తున్న ఎంపీపీ రామారావు

30న మండల సమావేశం

సీతంపేట: మండల సర్వసభ్య సమావేశం ఈ నెల 30న జరగనున్నట్టు ఎంపీడీవో కొండపల్లి సత్యం గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక యూత్ ట్రైనింగ్ సెంటర్ వద్ద జరిగే సమావేశానికి అధికారులు, ప్రజాప్రతినిధులు హాజరు కావాలని కోరారు.